
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

శనివారం 10 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.139	202	229
సూర్యాపేట	రూ.135	190	210
నల్లగొండ	రూ.130	190	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 21.2




- ఎన్నికల హామీలకు బడ్జెట్లో నిధులిస్తారని ఆశాభావం
- విద్యాసంస్థల ఏర్పాటు, వైద్య సదుపాయాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఉంటుందనే చర్చ
- సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలకు నిధులిచ్చేనా?

'భట్టి' బడ్జెట్‌పై బోలెడు ఆశలు

ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టివిక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్‌పై ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో, కేంద్ర ప్రభుత్వం సైతం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టింది. దానికనుగుణంగా రాష్ట్రంలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పటికీ జిల్లాలో దశాబ్దాలుగా నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి, చిరకాల కోరికలుగా ఉన్న ప్రాజెక్టుల పూర్తికి నిధులు, రోడ్లు, ఆస్పత్రుల ఆధునికీకరణ, సాగునీటి పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్‌లో స్థానం దక్కుతుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

విద్యా సంస్థల ఏర్పాటుపై ఆశలు



జిల్లాలో ఉన్నత విద్యావకాశాలను పెంచేలా, పేద, మధ్యతరగతివర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తెచ్చేలా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని అంతా భావిస్తున్నారు. ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీంతో జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు ఉపాధి కల్పించే కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న స్కిల్‌డెవలప్‌మెంట్ యూనివర్సిటీ సైతం ఉమ్మడిజిల్లాకు దక్కనుంది. హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ పీజీ కళాశాల, నార్కట్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడలో మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలలు, చౌటుప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలు, కోదాడలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటుకు ఆమోదం లభిస్తుందని ఆయా ప్రాంత వాసులు ఆశిస్తున్నారు. హాలియాలో ఇప్పటికే ఉన్న డిగ్రీకళాశాల నూతన భవన నిర్మాణానికి నిధులిస్తారని భావిస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలకు కేటాయింపులు ఉండేనా?



ఉమ్మడి జిల్లాలో వైద్యసేవలను క్రమబద్ధీకరించడంతో పాటు, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన కార్యాచరణను ఈ బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంతా ఆశిస్తున్నారు. ప్రధానంగా ప్రతీ మండల కేంద్రంలో 30పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఏరియా ఆస్పత్రిని ఏర్పాటుచేయాలనే డిమాండ్లకు ఈ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం లభిస్తాయని భావిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిని అప్‌గ్రేడేషన్‌కు అనుమతి ఇస్తారని, మోత్కూరులో పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడేషన్, మునుగోడు పీహెచ్‌సీని 30పడకల ఆస్పత్రిగా మార్చాలనే డిమాండ్లు నెరవేర్చాల్సి ఉంది. ఆలేరులో 30పడకల ఆసుపత్రిని 100 పడకలకు మార్చాలని, హాలియాలో 30పడకల ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామకాలతో పాటు, మందులు, ఇతర మౌలికవసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరుతా..



దేవరకొండ నియోజకవర్గంలోని డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. ఇప్పటికే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారు. ప్రాజెక్టులతోపాటు తాగునీటి అవసరాలకు, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తా.

- బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

నిధులు కేటాయిస్తేనే పర్యాటక ప్రాంతాల అభివృద్ధి



ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, వాడపల్లి శ్రీలక్ష్మీనరసింహ, మీనాక్షి ఆగస్తేశ్వర ఆలయాలతో పాటు, దేవరకొండ, దేవరచర్ల, పిల్లలమర్రి, మేళ్లచెర్వు స్వయంభు శంభులింగేశ్వర ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దేవరకొండ ఖిల్లాకు పూర్వవైభవం తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. చౌటుప్పల్ మండలంలోని రాచకొండను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని, రాచకొండలో ఫిలింసిటీ ఏర్పాటుచేయాలనే డిమాండ్లు ఉన్నాయి. భువనగిరి ఖిల్లా అభివృద్ధికి ఇప్పటికే కేంద్రం నిధులు కేటాయించగా, పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే దీనికి తోడ్పాటుగా రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని స్థానికులు భావిస్తున్నారు.

కొత్త మండలాల్లో సౌకర్యాల కోసం ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటైన కొత్త మండలాల్లో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ప్రధానంగా మండల కార్యాలయాలకు నూతన భవనాలు, ఇతర వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తారని ఆయా మండల వాసులు భావిస్తున్నారు. మిర్యాలగూడ మునిసిపాలిటీలో దశాబ్దకాలంగా అసంపూర్తిగా నిలిచిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల పూర్తికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, హాలియా మునిసిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. వీటితోపాటు పలు మౌలిక వసతుల కల్పనపై బడ్జెట్‌లో నిధులు ఉంటాయని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు

ఉమ్మడి జిల్లాలో దశాబ్దాలుగా ఊరిస్తున్న పలు సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలకు ఈ బడ్జెట్‌లో గ్రీన్‌సిగ్నల్ లభిస్తుందని ఉమ్మడి జిల్లా ప్రజలు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు కృష్ణానది నికర జలాల కేటాయింపులున్న ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తికి భారీగా నిధులు ఉంటాయని అనుకుంటున్నారు. సొరంగమార్గం పూర్తయితే ఉమ్మడి జిల్లాలో 3.50లక్షల ఎకరాలకు సాగునీరు, 500 గ్రామాలకు తాగునీటి ఇక్కట్లు తప్పుతాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకం పూర్తికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. పెండ్లిపాకల ప్రాజెక్టు, మునుగోడు నియోజకవర్గంలోని శివన్నగూడెం, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికి పూర్తిస్థాయిలో నిధులు అవసరం. నకిరేకల్ నియోజకవర్గంలో బి.వెల్లంల ఉదయసముద్రం ఎత్తిపోతల పథకానికి రూ.400కోట్లు, కట్టంగూరు మండలంలో అయిటిపాముల రిజర్వాయర్ పూర్తికి రూ.100కోట్లు మంజూరు కావాల్సి ఉంది. మిర్యాలగూడ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న కేశవాపురం, వాడపల్లి-బొత్తలపాలెం, దున్నపోతులగండి, వీర్లపాలెం తోపుచర్ల ఎత్తిపోతల పథకాల పూర్తికి నిధులు కేటాయించాల్సి ఉంది. తుంగతుర్తి నియోజకవర్గంలో బునాదిగానికాల్వ పూర్తిచేసి మోత్కూరు, అడ్డగూడూరుకు సాగునీటి వసతి కల్పిస్తామని ఎమ్మెల్యే సామేల్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. చౌటుప్పల్ మండలంలో పిల్లాయిపల్లి కాల్వ పూర్తికి, చండూరు మండలం బెండలమ్మచెరువు నిర్మాణానికి, శేషలేటివాగు ఫీడర్ ఛానల్, కొండాపురం ఫీడర్ ఛానల్ నిర్మాణాలకు నిధులివ్వాలని కోరుతున్నారు. కనగల్ మండలంలో ఏఎమ్మార్పీ కాల్వ వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేయాలనే ప్రధాన డిమాండ్ ఉంది. పొనుగోడు చెరువుకు నీటి సరఫరా చేసేందుకు కాల్వ నిర్మించాల్సి ఉంది. పిల్లాయిపల్లి కాల్వ నిర్మించి రేగట్టెకు నీటి తరలింపు, పగిడిమర్రి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులిస్తారని ఆశిస్తున్నారు. హాలియా మండలంలో పేరూరు మేజర్ ఆధునికీకరణ పనులు, తిరుమలగిరి (సాగర్) మండలంలోని నెల్లికల్లు లిఫ్టు పూర్తికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంపై ఈ బడ్జెట్ సమావేశాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాలకు, నిర్వాసితులకు అవసరమైన పరిహారాన్ని ఈ బడ్జెట్‌లో కేటాయించాలనే డిమాండ్ ప్రధానంగా ఉంది. సూర్యాపేట నియోజకవర్గంలో కీలకమైన శ్రీరాంసాగర్ రెండోదశ చివరి భూములకు నీరందించేందుకు కాల్వల ఆధునికీకరణ, పనుల పూర్తికి నిధులివ్వాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు.

● అసెంబ్లీలో ఎమ్మెల్యేల గళం

ఆటో కార్మికుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట రూరల్: ఆటో కార్మికుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు లేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, యాదగిరిగుట్టలో ఆటో కార్మికులను ఆదుకోవాలని ప్రస్తావించగా, ఆయన మాటలకు అడ్డుతగులుతూ ప్రభుత్వ విప్ అయిలయ్య స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి ఆలయాన్ని రూ.1,200 కోట్లతో పునర్నిర్మాణం చేశారని, అయినా స్వామి వారిని దర్శించుకొనే భక్తులు, ఆటో కార్మికులు, భూములు కోల్పోయిన వారి బాధలు చూస్తే ప్రతీ ఒక్కరికి అర్థమవుతుందన్నారు. అభివృద్ధి పేరుతో 500 కుటుంబాలను ఇబ్బందులకు గురిచేశారని, 300మంది కార్మికుల ఆటోలను కొండపైకి వెళ్లకుండా రద్దుచేసి వారి పొట్టలు కొట్టారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు చొరవతో ఆటోలను తిరిగి కొండపైకి అనుమతించారని, ఈ నెలలో దీన్ని ప్రారంభిస్తామన్నారు. భక్తులకు వసతి కల్పించేందుకు డార్మెటరీ హాల్ నిర్మాణం అవుతోందని ఆయన వివరించారు. వైటీడీఏ పేరుతో కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి 50శాతం నిధులు దోచుకున్నారని ఆరోపించారు. యాదాద్రి ఆలయంలో అర్చకులకు కనీస సౌకర్యాలు లేవని, ఇలాంటి పనులు చేసిన గత ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యే మొసలికన్నీరు కార్చడం హాస్యాస్పదమన్నారు.

పదేళ్ల పాలనలో మూసీ మురికి నీరే గతి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లి: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నకిరేకల్ నియోజకవర్గంలో కనీసం ఒక్క ఎకరాకు అదనంగా నీరివ్వలేదని, సాగు నీటి ప్రాజెక్టులకు నోచుకోని నియోజకవర్గంలో మూసీ మురికి నీరే తప్ప కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటి చుక్క ఇవ్వలేకపోయారని ఎమ్మెల్యే వేముల వీరేశం అసెంబ్లీలో ధ్వజమెత్తారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు ప్రారంభోపన్యాసం చేసిన ఆయన ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇదివరకు బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, అక్కడ అవమానించినందునే తనను ఆదరించిన కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన తప్పులు తనకు తెలుసని, తనను అనవసరంగా కెలకవద్దని, తనతో కెలికించుకోవద్దని హెచ్చరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఏ ప్రాజెక్టును బీఆర్ఎస్ పూర్తి చేయలేదన్నారు.

మిషన్ భగీరథ ద్వారా తన నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నీటి సరఫరా కాకపోగా, ప్రత్యామ్నాయ నీటి పథకాలకు నిధులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో వార్డుల్లో ఉన్న కుళాయిల ద్వారానే సరిపడా నీళ్లందాయన్నారు. ఒక్క గురుకుల పాఠశాలకు కూడా సొంత భవనం నిర్మించలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ విజయంతో నియంత పాలనకు తెరపడి, స్వచ్ఛ తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా వాస్తవాలను అంగీకరించి ఓపికతో ఉండాలన్నారు. ఇదిలా ఉండగా, బడ్జెట్ సమావేశా సందర్భంగా గవర్నర్ తీర్మానానికి ధన్యవాదాలు తెలుపుతూ అధికార పక్షం నుంచి ప్రసంగించే అవకాశం వీరేశానికి దక్కింది. తనకు ఈ అవకాశాన్ని ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అట్టహాసంగా ఖోఖో పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి 56వ ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను డీఈవో నారాయణరెడ్డి ప్రారంభించగా, తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల జట్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. తొలిరోజు 14 మ్యాచ్‌లు జరిగాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో హోరాహోరీగా సాగుతున్న పోటీలను తిలకించేందుకు స్థానికులు, క్రీడాభిమానులు ఆసక్తి చూపించారు. ●7లో..

రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలి



చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 9: రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చాలని, భూములను కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజ్ డిమాండ్ చేశారు. ఆర్ఆర్ఆర్‌లో భూములు కోల్పోతున్న చౌటుప్పల్, వలిగొండ మండలాలకు చెందిన రైతులు శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్ఆర్ఆర్‌తో వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, ఈ క్రమంలోనే మందోళ్లగూడలో రైతు మామిడి నర్సిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు.

నర్సిరెడ్డి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, భూములు కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్నాయంగా భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుకు 60 కి.మీ.ల దూరం నుంచి రీజనల్ రింగు రోడ్డును ఏర్పాటు చేయాలని ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన ప్రకటనకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పందించాలని, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు తక్కువగా నష్టం జరిగేలా అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రైతులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీరిక సంజీవరెడ్డి, రైతు సంఘం నాయకులు వెలగ నర్సిరెడ్డి, బోగయ్య లక్ష్మీనర్సు, మామిడి జంగారెడ్డి, మంద బాలకృష్ణ, బాలకృష్ణారెడ్డి, బుర్రి యాదిరెడ్డి, సప్పిడి భూపాల్‌రెడ్డి, బోరెం శ్రీనివాస్‌రెడ్డి, సప్పిడి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారులు ఆర్థికంగా బలోపేతం చెందాలి

కలెక్టర్ హనుమంతు కె.జెండగే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 9: సంప్రదాయ చేతివృత్తిదారులు, హస్త కళాకారులు పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం చెందాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ యోజన అమలు కమిటీతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం అమలు కోసం పట్టణ, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చేతి, కులవృత్తులపై ఆధారపడి జీవించే వారు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. తద్వారా నాణ్యమైన ఉత్పత్తులను పెంచడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. పథకంలో చేరడం వల్ల విశ్వకర్మ ధ్రువపత్రం, ఐడీ కార్డుతో పాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందేందుకు కావాల్సిన శిక్షణ, టూల్ కిట్స్, రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకం, మార్కెటింగ్ చేసుకొనేందుకు మద్దతు లభిస్తుందన్నారు. మొత్తం 18 రకాల కులవృత్తులకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాలకు కేంద్రం అందించే ఆర్థిక సహాయంతో ఎదగాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఉండని, 18 ఏళ్లకు పైబడిన కుటుంబంలో ఒక్కరు మాత్రమే ఈ పథకానికి అర్హులని, ఎలాంటి విద్యార్హత లేకున్నా పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. పేరు నమోదుకు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ ఆన్‌లైన్‌లో ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అలాంటి దరఖాస్తులను పంచాయతీల్లో స్ర్కీనింగ్ చేసి జిల్లాస్థాయి అమలు కమిటీకి పంపాలన్నారు. ఎంపికైన వారికి రెండు రకాల శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ప్రాథమిక నైపుణ్య శిక్షణ ఐదు నుంచి ఏడు రోజులు, అధునాతన నైపుణ్య శిక్షణ 15 రోజులు ఉంటుందని, రోజు రూ.500 భృతి కూడా ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం రూ.15వేల విలువైన టూల్ కిట్లు, ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. రెండు విడతల్లో రూ.3లక్షల రుణం ఇవ్వడమేగాక మొదటి విడత 5శాతం వడ్డీతో 18నెలల్లో చెల్లించాల్సిన రూ.1లక్ష రుణం ఇవ్వనున్నట్టు తెలిపారు. అదేవిధంగా రెండో విడతలో మూడేళ్ల వ్యవధిలో చెల్లించాల్సిన రూ.2లక్షల రుణం ఇస్తామన్నారు. దశల వారీగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, జడ్పీ సీఈవో సీహెచ్.కృష్ణారెడ్డి, పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకురాలు సుమతీ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్‌బాబు, లీడ్ బ్యాంక్ అధికారి రామకృష్ణ, బీసీ సంక్షేమ అధికారి పి.యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



టేకులసోమారంలో నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ, ఫిబ్రవరి 9: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని టేకులసోమారం, పహిల్వాన్‌పురం, రెడ్లరూపాక గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలను తనిఖీచేసి మాట్లాడారు. గ్రామాల్లో గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చే విధానాన్ని పరిశీలించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య వారోత్సవాలను కట్టుదిట్టంగా నిర్వహించాని సూచించారు. మురుగు కాల్వలను పరిశుభ్రంగా ఉంచి దోమల నివారణకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో గీతారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ దివ్య, శిరీష, ఏపీవో పరుశరాములు, తదితరులు ఉన్నారు.

కరుణించు.. నారసింహా!



వైకుంఠ గాలిగోపురం వరకు నిర్మించిన వెహికల్ అండర్ పాస్ బ్రిడ్జి

యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం స్థానిక వ్యాపారుల జీవితాలను చిన్నాభిన్నం చేసింది.. దశాబ్దాలుగా కొండమీద, కొండకింద వ్యాపారు లు నిర్వహిస్తున్న వారు ఆలయ విస్తరణలో సర్వం కోల్పోయారు. స్థానిక వైకుంఠద్వారం నుంచి పాతగుట్ట చౌరస్తా వరకు నిర్మించిన అండర్‌పాస్ రహదారి అక్కడి వ్యాపారులను కోలుకోలేకుండా చేసింది. భక్తులు వచ్చే మార్గం లేకుండాపోవడం, బస్‌టెర్మినల్ నుంచి నేరుగా బస్సుల రాకపోకలు కొనసాగుతుండటంతో వ్యాపారాలు మందగించాయి. దీనికి తోడు గండిచెరువు పనుల్లో మందగమనం, మొదటిఘాట్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్, పారిశుధ్యం లోపం భక్తులను, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో కరుణించు నారసింహా అంటూ వ్యాపారులు, భక్తులు వేడుకుంటున్నారు. ●7లో..

రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణం




కలెక్టరేట్‌లో ఫలితాలు విడుదల చేస్తున్న డీఈవో

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 9: నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌కు (ఎన్ఐఎఫ్) సంబంధించిన ప్రదర్శనల ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని డీఈవో నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి 2022-23 సంవత్సరం ఇన్‌స్పైర్ ప్రదర్శన ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022-23 సంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ఎంపికను గత నెలలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించామన్నారు. విద్యార్థుల ప్రదర్శన వీడియోలు, ఫొటోలను ఇన్‌స్పైర్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేశారన్నారు.వచ్చిన 129ప్రాజెక్టుల్లో ఉత్తమమైన 13 ప్రాజెక్టులను జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో యాదాద్రి జిల్లా నుంచి అత్యధిక ప్రాజెక్టులు ఎంపిక కావడం ఆనందంగా ఉందని సైన్స్ అధికారి భరణికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీజీఈ కృష్ణారెడ్డి, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు లింగారెడ్డి, రాధ, నిర్మలజ్యోతి పాల్గొన్నారు.

మోత్కూరులో నెగ్గిన అవిశ్వాసం

- మునిసిపల్ చైర్‌పర్సన్ గైర్హాజరు
- క్యాంపు నుంచి నేరుగా వచ్చిన కౌన్సిలర్లు



మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అనుకూలంగా చేతులు ఎత్తిన కౌన్సిలర్లు

మోత్కూరు మునిసిపల్ చైర్ పర్సన్ తీపిరెడ్డి సావిత్రిపై కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మునిసిపాలిటీలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా ఓటింగ్‌కు 10మంది హాజరయ్యారు. వీరంతా అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. చైర్‌పర్సన్‌తో పాటు, 10వ వార్డు కౌన్సిలర్ బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. ●8లో..

నమ్మించి..మేనబావతో విషం కలిపించి హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

డిండి, ఫిబ్రవరి 9 : పథకం ప్రకారం మేనబావతో కల్లులో విషం కలిపించి ఓ వ్యక్తిని హత్య చేసిన కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నల్లగొండ జిల్లా దేవరకొండ సీఐ సురేష్, ఎస్ఐ సైదులుతో కలిసి దేవరకొండలో కేసు వివరాలు వెల్లడించారు. వీరబోయినపల్లి గ్రామానికి చెందిన నంది సహదేవుడు, అతడి చిన్నాన్న నంది ఈశ్వరయ్యకు మధ్య కొన్నేళ్లుగా భూవివాదం నడుస్తోంది. ఏవిధంగానైనా నంది సహదేవుడిని అంతమొందించాలని భావిస్తున్న ఈశ్వరయ్య నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం వెలమలపల్లి గ్రామానికి చెందిన సహదేవుడి మేన బావ జంగయ్యను సంప్రదించాడు. నాటుసారాలో విషం కలిపి సహదేవుడిని చంపేందుకు పథకం రూపొందించారు. ఈ నెల 5న నాటుసారాలో విషం కలిపి సహదేవుడి వ్యవసాయ పొలంలో సమాధుల వద్ద ఉంచి తీసుకొమ్మని సహదేవుడికి ఫోన్ చేశాడు. సహదేవుడు, అతడి కుమారుడు రాము అదే రోజు సాయంత్రం నాటుసారా తెచ్చుకొని తాగారు. కొద్దిసేపటికే సహదేవుడికి వాంతులు, విరోచనాలు కావడంతో అతడిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సహదేవుడి కుమారుడు రాము హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు విచారణ జరిపి నాటుసారాలో విషం కలిపిన నంది ఈశ్వరయ్య, జంగయ్యలను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధతో ఉద్యోగి ఆత్మహత్య

మునగాల, ఫిబ్రవరి 9: అప్పుల బాధతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా మునగాల ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ముస్కుల వీరశేఖర్(40) నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. అయితే చిట్‌ఫండ్‌లో పెట్టుబడి పెట్టి అప్పులఊబిలో కూరుకుపోయాడు. అప్పులు తీరే మార్గం లేక మనస్తాపం చెంది మూడు రోజుల కిందట క్రిమిసంహారక తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరుణించు నారసింహా!

యాదగిరి క్షేత్రంలో పునర్నిర్మాణ పనులతో వ్యాపారు లు వీధినపడ్డారు. యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పాతగుట్ట చౌరస్తా నుంచి వైకుంఠద్వారం వరకు నిర్మించిన వెహికల్ అండర్ పాస్‌తో వ్యాపారాలు ఏ మాత్రం సాగక తమ బతుకులు ఆగమయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామి.. మమ్ము రక్షింపరావేమి అంటూ వేడుకుంటున్నారు. ఇక గిరిప్రదక్షిణ రహదారి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుంది, గండిచెరువు అభివృద్ధి పనులు కొనసాగుతాయా అన్న అనుమానాలు స్థానికులు లేవనెత్తుతున్నారు. మొదటి ఘాట్‌రోడ్ ఉండగా మరో ఫ్లైఓవర్ నిర్మాణం అవసరమా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా పుణ్యక్షేత్రంలో పారిశుధ్యం అంతంతమాత్రంగా ఉండటం, గుట్టలుగా పేరుకుపోయిన దుర్గంధం వెదజల్లుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● యాదగిరిగుట్ట

యాదగిరీశా శరణు 6



మొదటి ఘాట్‌రోడ్డుకు అనుసంధానంగా నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్

ఆలయ విస్తరణలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారిని విస్తరించాలని వైటీడీఏ నిర్ణయించింది. ఈ క్రమంలో కొండకింద వైకుంఠ గాలిగోపురం నుంచి సన్నిధి హోటల్ వరకు విస్తరణకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళికలు సిద్ధంచేసి ముసాయిదా ప్రణాళికలను రూపొందించారు. సుమారు రూ.13 కోట్లతో విస్తరణ పనులను ప్రారంభించారు. అయితే పాతగుట్ట చౌరస్తా నుంచి వైకుంఠ గాలిగోపురం వరకు రహదారిపై వెహికల్ అండర్ పాస్‌ను నిర్మించారు. సుమారు 300 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో నిర్మించిన అండర్ పాస్ స్థానికుల పాలిటశాపంగా మారింది.

అంతకుముందు

ఆలయ పునర్నిర్మాణానికి ముందు కొండపైన స్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు కొండకింద తులసికాటేజ్, స్వామివారి గోశాలతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుటుంబసభ్యులతో బస చేసేవారు. ఈ క్రమంలో కొండకింద ప్రధాన రహదానికి ఇరువైపులా ఉన్న దుకాణ సముదాయాలకు వెళ్లి పసుపు, కుంకుమ, స్వామివారి ఫొటోలు, మిఠాయిలు, తమ పిల్లలకు కావాల్సిన ఆటబొమ్మలు తదితరాలను కొనుగోలు చేసేవారు. దీంతో కొండపైనే కాకుండా కొండకింద పట్టణ ప్రధాన వీధులు సైతం కోలాహలంగా కనిపించేవి. వైకుంఠ గాలిగోపురం నుంచి కొండపైకి వెళ్లే మెట్లదారిలో స్థానికులు ఏర్పాటుచేసుకున్న దుకాణాల్లో నడకదారి భక్తులు తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసేవారు. అదేవిధంగా రహదారిని ఆనుకుని ఉన్న దుకాణాల్లోనే పట్టణ ప్రజలు సైతం సరుకులు కొనుగోలు చేసేవారు. ఇలా స్థానిక వ్యాపారుల వ్యాపారం సజావుగా సాగేది.

అండర్‌పాస్‌తో వ్యాపారుల బతుకులు ఆగం

అండర్‌పాస్ నిర్మాణంతో ఒక్కసారిగా వ్యాపారస్తుల జీవితాలు అగాధంలోకి తోసినట్లయ్యింది. ఓ వైపు రహదారి విస్తరణకు భూములు కోల్పోయారు. దీనికి తోడు రహదారి విస్తరణ పనులతో స్థానికులు కూడా అటుగా వచ్చిన కొనుగోలు చేయడం తగ్గించారు. ఇక యాత్రీకుల సంగతి సరేసరి. అండర్‌పాస్ పైనుంచే నేరుగా బస్టాండ్ వద్దకు వెళ్తుండటంతో దుకాణాల వైపు వచ్చే వారు లేరు. దీంతో వ్యాపారులు పూర్తిగా మందగించి కుటుంబాలు వీధిన పడ్డాయి.

కొత్త బస్టాండ్లతో వ్యాపారుల ఇబ్బందులు

యాదాద్రి ఆలయ విస్తరణలో భాగంగా గండిచెరువు సమీపంలో ఆర్టీసీ బస్టాండ్, టెంపుల్ బస్‌టెర్మినల్‌ను నిర్మించడంతో ప్రస్తుతం పాత జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న బస్టాండ్ సమీపంలోని వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బస్సులన్నీ ఇక్కడే నిలుస్తుండడంతో బస్టాండ్ సమీపంలోని దుకాణాలు ఎప్పుడూ రద్దీగా ఉంటూ వ్యాపారాలు బాగా జరిగేవి. ఇప్పుడు కొత్త బస్టాండ్ నిర్మించాక నేరుగా భక్తులు అక్కడికి చేరుకుని, కొండపైకి వెళ్తున్నారు. దీంతో ఎన్నాళ్ల నుంచో దుకాణాలు నడుపుతున్న వ్యాపారస్తులు వ్యాపారంజరగక తీసుకున్న రుణాలు,వాటికి మిత్తీలు లోన్‌లు, కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.



గండిచెరువు వద్ద అసంపూర్తిగా మెట్ల నిర్మాణం

సాగుతున్న గిరిప్రదక్షిణ రహదారి పనులు

పంచనారసింహుడు కొలువుదీరిన కొండచుట్టూ సుమారు 2.6కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ రహదారి పనులు సాగుతూనే ఉన్నాయి. రూ.3.2 కోట్లతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. కాగా ఇప్పటివరకు 1.8 కిలోమీటర్ల రహదారి దాదాపు పూర్తి కాగా మిగిలిన 0.8కిలో మీటర్ల మేరకు రహదారి పనులు జరగాల్సి ఉంది. ఈ పనులు పూర్తయిన తర్వాత గిరిప్రదక్షిణ రహదారి చుట్టూ ఫెన్సింగ్, రెయిలింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే గిరిప్రదక్షిణ రహదారి పనులకు నిధుల లేమి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

గండిచెరువు అభివృద్ధి సాగేనా?

యాదగిరికొండ దిగువన మల్లాపూర్ వెళ్లే రహదారిలోని గండిచెరువును రూ.33కోట్ల అంచనా వ్యయంతో మినీ ట్యాంక్‌బండ్ తరహాలో చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగేనా అన్న ప్రశ్న వినిపిస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరంభించిన గండిచెరువు విస్తరణ పనులకు నిధుల గండం నెలకొన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు సుమారు రూ.22కోట్లతో పనులు జరగ్గా, మిగిలిన పనులకు రూ.11కోట్ల నిధులు సరిపోవని, ఇక మంజూరైన నిధులతో పనులు చేపడదామన్నా నిధులు మంజూరయ్యేనా అన్న అనుమానాలను వ్యక్తమవుతున్నాయి. గండిచెరువు ముందున్న గుట్టపై లేజర్ షోకు ఏర్పాట్లు, ధ్యాన, ప్రవచన మండపాలతో పాటు పలు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

మొదటి ఘాట్‌రోడ్ ఉండగా వంతెన అవసరమా?

యాదగిరిక్షేత్రంలో తులసికాటేజ్ ప్రాంతం నుంచి మొదటి ఘాట్‌రోడ్‌ను అనుసంధానం చేస్తూ వైటీడీఏ సుమారు రూ.33కోట్లతో 480 మీటర్ల పొడవు, 25అడుగుల వెడల్పుతో ఫ్లైఓవర్‌ను నిర్మిస్తోంది. ఈ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. అయితే దశాబ్దాల కిందట నిజాం రాజుల పాలనలో కొండపైకి రవాణ సౌకర్యాల కోసం మొదటి ఘాట్‌రోడ్ నిర్మించిన సంగతి తెలిసిందే. అయితే ఆలయ విస్తరణ పనుల వాహనాలు, భక్తుల వాహనాల రద్దీ కారణంగా మొదటి ఘాట్‌రోడ్ దెబ్బతినడంతో ఉద్ఘాటనకు ముందు ఈ ఘాట్‌రోడ్‌ను 36అడుగల వెడల్పుతో పునర్నిర్మించారు. మొదటి ఘాట్‌రోడ్ నిర్మాణం ఉండగా దానిని అనుసంధానం చేస్తూ మరో ఫ్లైఓవర్ నిర్మించడం ఎందుకని, ఈ ఫ్లైఓవర్ ఏమాత్రం అవసరం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఆలయ విస్తరణ కన్నా ముందు రెడ్ల సత్రం సమీపం నుంచి కొండపైకి నిర్మించిన రెండవ ఘాట్‌రోడ్ నేటికి వాహనా రాకపోకలకు అనుతిలేక పోవడంతో వినియోగం లేక వృథాగా ఉంటోంది.

గుట్టలో పడకేసిన పారిశుధ్యం

గుట్ట ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొండపైన బస్‌బే, ప్రధానకార్యాలయం సెల్లార్, కొండకింద నిత్యాన్న వితరణ సత్రం, వ్రత మండపం, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. కొండపై వరకు పందులు, కుక్కలు సంచరిస్తూ వీరవిహారం చేస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి.

నిరుపయోగంగా ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లు

యాదగిరిగుట్ట ఆలయ విస్తరణలో భాగంగా కొండకు దక్షిణదిశలో ల్యాండ్ స్కేపింగ్ గార్డెన్‌లను వైటీడీఏ అధికారులు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించారు. అయితే ఈ గార్డెలను భక్తులు చేరుకునే అవకాశం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇదిలాఉంటే గార్డెన్ల నిర్వహణ కోసం సైతం రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుండటం గమనార్హం.



నిరుపయోగంగా రెండో ఘాట్‌రోడ్డు

వార్షిక బ్రహ్మోత్సవాలకు
సిద్ధమవుతున్న పాతగుట్ట

● 15 నుంచి అధ్యయనోత్సవాలు ● 19 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన పూర్వగిరి(పాతగుట్ట) లక్ష్మీనరసింస్వామి సన్నిధి వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వార్షిక అధ్యయనోత్సవాలు, ఈ నెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు పాంచాహ్నిక దీక్షలో పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే రుత్వికులకు, వీవీఐపీలకు, వివిధ శాఖల అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపిస్తున్నారు. పాతగుట్ట ప్రధానాలయంలో యాగశాల నిర్మాణం, అలంకార సేవల కోసం వాహన సేవలను శుభ్రం చేసి సిద్ధం చేస్తున్నారు. పాతగుట్ట కొండపైన పుష్కరిణి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి ఉత్సవాలకు ముస్తాబు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.



పాతగుట్ట ఆలయ ప్రధాన ముఖద్వారం

బ్రహ్మోత్సవ ఘట్టాలు ఇలా..

- ఈ నెల 19వ తేదీ సోమవారం ఉదయం స్వస్తివాచన పూజలతో ఉత్సవాలు ఆరంభమవుతాయి. సాయంత్రం అంకురారోపణ, మృత్స్యంగ్రహణం పూజలు.
- 20న ఉదయం ధ్వజారోహణం. సాయంత్రం దేవతాహ్వానం, బేరీపూజ, హవనం.
- 21న ఉదయం సింహవాహన అలంకార సేవ, రాత్రికి ఎదుర్కోలు మహోత్సవం.
- 22న ఉదయం హవనపూజలు, రాత్రి వేళ తిరుకల్యాణోత్సవం.
- 23వ తేదీ ఉదయం నిత్య పూజలు, రాత్రి 8గంటలకు దివ్య విమాన రథోత్సవం.
- 24న ఉదయం యాగశాలలో మహాపూర్ణాహుతి,విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ స్నానం, సాయంత్రం దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం.
- 25న ఉదయం శతఘటాభిషేకం..పండిత సన్మానం..బ్రహ్మోత్సవ పరిసమాప్తి.

పాతగుట్ట ఆలయంలో నిత్యకల్యాణాలు రద్దు

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు వార్షిక అధ్యయనోత్సవాలు, తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో నిత్య, శాశ్వత కల్యాణాలను రద్దు చేశారు. ఈ నెల 23వ తేదీన స్వామివారి దివ్యవిమాన రథోత్సవం కారణంగా అర్చనలు, అష్టోత్తరశతానామార్చనలు, భోగాలు, 24వ తేదీన చక్రతీర్థం, 25వ తేదీన స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించనున్న నేపథ్యంలో అభిషేకాలు అర్చనలు నిలిపివేస్తారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



అద్దాల మండపంలో అమ్మవారికి మంగళహారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం స్వామికి సువర్ణ పుష్పార్చనలు, ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవ పర్వాలు నేత్రపర్వంగా సాగాయి. సుప్రభాతంతో నిత్యపూజలు ఆరంభించిన ఆచార్యులు గర్భాలయంలోని సువర్ణ ప్రతిష్టా అలంకార కవచమూర్తులను 108 బంగారు పుష్పాలతో అర్చించారు. స్వయంభువులను వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలు, కుంకుమలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి, ముఖమండపంలోని స్పటిక మూర్తులకు నిత్యార్చనలు, చండీ హవన పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. ఆండాళ్ అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో అమ్మవారి ఊంజల్ సేవను తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆస్థాన విద్వాంసులు మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,09,975ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు చినవెంకట్‌రెడ్డి మృతి



కేతేపల్లి, ఫిబ్రవరి 9: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్ర మాజీ సర్పంచ్, స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక వృద్ధుడు కొత్తపేట గ్రామానికి చెందిన బుర్రి చినవెంకట్‌రెడ్డి(102) గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. చినవెంకట్‌రెడ్డి 1971-83 వరకు ఉమ్మడి కేతేపల్లి గ్రామపంచాయతీకి మొదటి సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన స్వగ్రామం కొత్తపేట కాగా పాతికేళ్లుగా హైదరాబాద్‌లో కుమారుల వద్ద ఉంటున్నారు. కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం రాత్రి మరణించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకట్‌రెడ్డికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పీవీ ఆలోచనల ప్రతిరూపం.. సర్వేల్ గురుకులం

సంస్థాన్ నారాయణపురం ఫిబ్రవరి 9 : యాదాద్రిభువనగిరి జిల్లాలోని సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలోని గురుకుల విద్యాలయంతో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు విడదీయరాని అనుబంధం ఉంది. పీవీ నరసింహారావుకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆయనతో ఉన్న జ్ఞాకాలను సర్వేల్ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. పేదరికంలో మగ్గుతున్న గ్రామీణ ప్రాంతాల్లోని దారిద్య్రరేఖకు దిగువన ఉన్న పిల్లలకు చక్కటి విద్యాబోధన అందించాలన్నది పీవీ ఆలోచన. ఆయన ఆలోచనలోంచి రూపుదిద్దుకున్నదే సర్వేల్ గ్రామంలో ఏర్పాటైన దేశంలోనే మొట్టమొదటి గురుకుల విద్యాలయం. 1970లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన పీవీ నరసింహారావు సర్వేల్ గ్రామంలోని సర్వోదయ ఆశ్రమాన్ని సందర్శించారు. అప్పట్లో స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సర్వేల్ గ్రామంలో ఒక విద్యాసంస్థను ఏర్పాటు చేసేందుకు అనుమతించాలని కోరారు. ఆయన అడిగిందే తడువుగా గ్రామంలో గురుకుల విద్యాలయం ఏర్పాటుకు అనుమతిఇచ్చారు. తన కలను సాకారం చేయడానికి పీవీ వెంటనే ప్రణాళికలు రూపొందించారు. పూర్వపు గురుకులాలను తలపించే రీతిలో ఆధునిక గురుకుల విద్యాలయాన్ని రూపొందించాలనుకున్నారు. దీని నిర్మాణానికి సర్వేల్ గ్రామానికి చెందిన సర్వోదయ నాయకుడు మద్ది నారాయణరెడ్డి ముందుకొచ్చారు. నారాయణరెడ్డి తన ఆశ్రమానికి చెందిన 40 ఎకరాల భూమిని దానం చేశారు. అంతరం పీవీ నరసింహారావు సీఎం హోదాలో మళ్లీ సర్వేల్ గ్రామాన్ని సందర్శించారు. సర్వోదయ ఆశ్రమంలో ఏర్పాటుచేసిన దేశంలోనే మొట్టమొదటి గురుకుల విద్యాలయాన్ని 1971 నవంబరు 23 సీఎం హోదాలో పీవీ నరసింహారావు ప్రారంభించారు. ఆనాడు పీవీ సర్వేల్ గ్రామంలో ప్రారంభించిన గురుకుల విద్యాలయం ఎంతో సత్ఫలితాలను ఇచ్చింది. సర్వేల్ గురుకుల విద్యాలయం స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేయాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం 1972 మార్చి 1న స్వయం పరిపాలన అధికారం గల ప్రత్యేక గురుకుల విద్యాలయ సంస్థను ఏర్పాటుచేసింది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక గురుకుల విద్యాలయాలు ఆవిర్భవించాయి. దీంతో గురుకుల విద్యాలయాలకు రూపకర్తగా పీవీ మారారు. పీవీ ఆలోచనలకు ప్రతిరూపంగా ఆవిర్భవించిన గురుకుల విద్యాలయాలు ఎంతోమంది లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాయి.



మర్రిగూడలో అందుబాటులోకి వైద్యసేవలు

- వైద్యులు లేక మూతబడిన మర్రిగూడ ఆసుపత్రి
- నిలిచిన సేవలపై ఆంధ్రజ్యోతి మినీలో కథనం
- ముగ్గురు వైద్యుల నియమించిన కలెక్టర్
- శుక్రవారం కొనసాగిన వైద్యసేవలు



శుక్రవారం తెరిచిన మర్రిగూడ ఆసుపత్రి

మర్రిగూడ, ఫిబ్రవరి 9 : వైద్యులు లేక మూతబడిన ఆసుపత్రి వైనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. మర్రిగూడ ఆసుపత్రి దుస్థితిపై 'డిప్యుటేషన్ల రద్దుతో మర్రిగూడ ఆస్పత్రి ఖాళీ' శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. మర్రిగూడ 30 పడకల ఆసుపత్రిలో డిప్యూటేషన్ మీద వచ్చి 12మంది వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డిప్యూటేషన్లు రద్దు చేస్తూ వైద్యులు ఎక్కడి నుంచి వచ్చారో ఆ స్థలాలకు వెళ్లి వెద్యసేవలు అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మర్రిగూడ ఆసుపత్రిలోని 12 మంది వైద్యులు ఒకేసారి తన స్థానాలకు వెళ్లిపోయారు. దీంతో గురువారం వైద్యసేవలు నిలిచిపోయాయి. ఆసుపత్రిలో నిలిచిన సేవలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ హరిచందన స్పందించారు. ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు నిలిచిపోకుండా కొనసాగించాలని ఆదేశించారు. ఆ మేరకు శుక్రవారం ముగ్గురు వైద్యులను నియమించి తిరిగి వైద్యసేవలు అందేలా ఏర్పాటుచేశారు. వైద్యులు లేక మూతపడిన ఆసుపత్రి తలుపులు శుక్రవారం తెరుచుకోవడంతో రోగులు హర్షం వ్యక్తం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈవో కే నారాయణరెడ్డి

అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఖోఖో
సీనియర్స్ పోటీలు ప్రారంభం

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 9 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ 56వ ఖోఖో సీనియర్ ఛాంపియన్‌షిప్ 2023-24 పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డీఈవో డాక్టర్ కే నారాయణరెడ్డి, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జంగ రాఘవరెడ్డి, నాతి కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించి, మాట్లాడుతూ సంప్రదాయ క్రీడ అయిన ఖోఖోకు పూర్వ వైభవం వస్తుందన్నారు. క్రమేపీ ఆదరణ పెరుగుతున్నదన్నారు. అంతకుముందు క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌తో అతిథులకు గౌరవవందనం చేశారు. పోటీల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీపీ నరాల నిర్మల, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీ రమేష్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ స్టాలిన్ పాల్గొన్నారు. తొలి రోజు మ్యాచ్‌లను క్రీడాభిమానులు ఉత్సాహంగా తిలకించారు.

20 జట్లు, 48 మ్యాచ్‌లు

భువనగిరిలో మూడు రోజుల పాటు జరుగనున్న తెలంగాణ 56వ సీనియర్స్ ఖోఖో ఛాంపియన్‌షిప్ 2023-24 పోటీలకు 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 20 మహిళ, పురుషుల జట్లు, 300 మంది క్రీడాకారులు, 300 కోచ్‌లు, మేనేజర్లు అధికారులు హాజరవుతున్నారు. పగలు, రాత్రి రెండు కోర్టుల్లో 48 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందుకోసం ఫ్లడ్‌లైట్లతో పాటు పూర్తిస్థాయి ఏర్పాట్లుచేశారు. దీంతో భువనగిరిలో క్రీడా సంబురం నెలకొంది. పోటీల్లో ప్రతిభ చూపే 20 మంది మహిళలు, 20 మంది పరుషులను రాష్ట్ర జట్లకు ఎంపిక చేస్తారు. ఎంపికైన క్రీడాకారులు జూన్‌లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో నిర్వహించే జాతీయ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తారు.

తొలి రోజు 14 మ్యాచ్‌లు



అవుట్ చేసేందుకు యత్నిస్తున్న క్రీడాకారుడు

ఛాంపియన్‌షిప్ పోటీల్లో తొలి రోజు 14 మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో 8 పురుషుల, 6 మహిళల మ్యాచ్‌లు జరిగాయి. తొలి రోజున అతిథ్య నల్లగొండ జట్లకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మహిళల జట్టు విజయం సాధించగా పురుషల జట్టు తొలి మ్యాచ్‌లో ఓడిపోవడం స్థానిక క్రీడాకారులను నిరాశపర్చింది. అయితే క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అభిమానులు క్రీడాస్ఫూర్తిని చాటారు. ఇదిలా ఉండగా ఛాంపియన్ షిప్ పోటీల్లో తొలి రోజు మహిళల విభాగంలో నల్లగొండ జట్టు ఖమ్మంపై 17-5 పాయింట్లతో, హైదరాబాద్ జట్టు ఆదిలాబాద్‌పై 10-5, మహబూబ్‌నగర్ జట్టు నిజామాబాద్‌పై 10-5, రంగారెడ్డి జట్టు మెదక్‌పై 15-3, ఆదిలాబాద్ జట్టు కరీంనగర్‌పై 11-4 పాయింట్లతో విజయం సాధించాయి. పురుషుల విభాగంలో ఆదిలాబాద్ జట్టు నల్లగొండపై 13-12, ఖమ్మం జట్టు మెదక్‌పై 13-12, కరీంనగర్ జట్టు మహబూబ్‌నగర్‌పై 13-10, వరంగల్ జట్టు నిజామాబాద్‌పై 15-10, రంగారెడ్డి జట్టు మెదక్‌పై 12-10, హైదరాబాద్ జట్టు నల్లగొండపై 13-11, కరీంనగర్ జట్టు ఖమ్మంపై 10-8, ఆదిలాబాద్ జట్టు వరంగల్‌పై 15-4 పాయింట్లతో గెలుపొందాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గీత కార్మికుడు మృతి



మేళ్లచెర్వు, ఫిబ్రవరి 9 : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గీత కార్మికుడు మృతి చెందాడు. ఏఎస్‌ఐ జానీ తెలిపిన వివరాలప్రకారం వెల్లటూరు గ్రామానికి చెందిన సీసం వెంకటేశ్వర్లు(36) కల్లు గీత వృత్తిని నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో మండల కేంద్రంలో వృత్తి పని ముగించుకుని స్వగ్రామం వెల్లటూరు వెళ్తుండగా రాఘవపురం క్రాస్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో హుజూర్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని జానీ తెలిపారు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు పిల్లలు కాగా భార్య వెంకటరావమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

హమ్మ బాబోయ్ దొంగలు

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 9 : తీగ లాగితే డొంక కదిలింది. ట్యాబ్ తస్కరిస్తున్న మహిళను పోలీసులు పట్టుకుని విచారించగా 10 మంది సభ్యులున్న దొంగల ముఠా గుట్టు రట్టయ్యింది. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంద్యాల జిల్లా డోన్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరంతా హైదరాబాద్ సమీపంలోని బొంగులూరు వద్ద ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటూ వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు, రద్దీ ప్రదేశాల్లో దొంగతనాలకు చేస్తుంటారు. ఈ క్రమంలోనే కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ మహిళ వద్ద నుంచి ట్యాబ్‌ను చోరీ చేస్తున్న మహిళను స్థానికులు పట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ మహిళను తమదైన శైలిలో విచారించగా 10 మందితో కూడిన దొంగల ముఠా పట్టుబడింది. వీరితో పాటు నలుగురు నేరస్తులు పట్టుబడ్డారు. వీరి నుంచి కారు, 10 సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ వీరబాబు, సిబ్బంది హేమనాయక్, వెంకటేశ్, భాస్కర్, గురువారెడ్డి, లక్ష్మణ్‌లను ఆయన అభినందించారు.

కొట్టేసిన బైక్‌జీపీఎస్ లొకేషన్‌తో పట్టివేత

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 9 : జల్సాల కోసం చోరీలు చేస్తున్న ఇద్దరు యువకులను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ నర్సింహారావు కేసు వివరాలను వెల్లడించారు. గతంలో కారుడ్రైవర్‌గా పనిచేసిన కనగల్ మండలం యడవల్లి గ్రామానికి చెందిన రుద్రాక్షి శ్రీను అలియాస్ నల్లగొండ శ్రీను తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు చేయడం ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఇతడిపై హైదరాబాద్, నల్లగొండ జిల్లాల పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో 40 చోరీ కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. ఓ చోరీ కేసులో చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించి ఈ నెల 1వ తేదీన బయటకువచ్చాడు. చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా పొద్దుటూరు మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన అలమూరి సంజీవరెడ్డితో పరిచయం ఏర్పడింది. ఇతను కొంతకాలం ఓ కంపెనీలో టెలీకాలర్‌గా పనిచేస్తూ ఓ కేసులో నిందితుడిగా జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటకు వచ్చాక చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో చోరీలు చేసేందుకు సిద్ధపడ్డారు. అందులో భాగంగా ఈ నెల 6న రాత్రి మిర్యాలగూడ వచ్చిన నిందితులిద్దరూ స్థానిక అశోక్‌నగర్‌లో తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలతో పాటు నగదును చోరీ చేశారని సీఐ తెలిపారు. అదేవిధంగా ఇదే కాలనీలోని ఓ ఇంటిముందు పార్క్‌చేసిన టీఎస్05ఎఫ్‌కే 5597 నెంబర్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. బైక్‌కు జీపీఎస్ లోకేషన్ ఉండడంతో దాని ఆధారంగా హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి ఏరియాలో సంచరిస్తున్నట్లుగా గుర్తించిన పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించగా తాము చేసిన నేరాలను అంగీకరించడంతో ఇరువురిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. కాజేసిన సొత్తును విక్రయించి మద్యం, సిగరేట్ ఇతర వ్యసనాలు తీర్చుకునేందుకు వచ్చే డబ్బును నిందితులు ఖర్చుచేసేవారని సీఐ తెలిపారు. కాగా దొంగలను చాకచక్యంగా పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్‌ఐలు కృష్ణయ్య, రాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, పీసీలు రవి, అనిల్,నరేష్, రామకృష్ణలను సీఐ అభినందించారు.

యువకుల ఛేజింగ్.. దొంగల పరార్



దొంగలు పరారైందీ ఈ కారులోనే

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 9 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారంలో అనుమానాస్పదంగా కారులో తిరుగుతున్న వ్యక్తులను ప్రశ్నించిన గ్రామ యువకులపై దాడి చేసి సినీ ఫక్కీలో పరారయ్యారు గుర్తు తెలియని వ్యక్తులు. వీరిని దొంగలుగా అనుమానిస్తున్నారు. కారులో పరారవుతుండగా వెనక యువకులు వెంబడించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. జైకేసారం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వారం రోజుల క్రితం కారులో వచ్చిన దొంగలు 10 మేకలను అపహరించారు. ఈ క్రమంలో శుక్రవారం ఓ కారులో ఇద్దరు యువకులు గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వీరిని యువకులు అడ్డుకుని ప్రశ్నించబోయారు. దీంతో వారు యువకులపై దాడి చేసి కారులో చౌటుప్పల్ వైపు పరారయ్యారు. కానీ యువకులు ధైర్యంతో కారును ఛేజింగ్ చేస్తూ వీడియో తీశారు. దొంగలు కారును చౌటుప్పల్ వద్ద వలిగొండ రోడ్డులోని బాలాజీ వెంచర్‌లోకి అతివేగంతో తీసుకెళ్లారు. ఆ ప్రాంత యువకులు అడ్డుకోవడానికి యత్నించినా ఆపకుండా సినీఫక్కీలో గల్లి గల్లి తిప్పుతూ అతివేగంతో హైవే మీదుకు దూసుకెళ్లారు. ఈ సంఘటనపై మాజీ సర్పంచ్ సైదులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు వనస్థలిపురం ప్రాంతానికి చెందినదిగా గుర్తించారు.

మోత్కూరులో నెగ్గిన అవిశ్వాసం

● సమావేశానికి మునిసిపల్ చైర్ పర్సన్ గైర్హాజరు

● క్యాంపు నుంచి నేరుగా కార్యాలయానికి చేరుకున్న కౌన్సిలర్లు

మోత్కూరు, ఫిబ్రవరి 9: మోత్కూరు మునిసిపల్ చైర్ పర్సన్ తీపి రెడ్డి సావిత్రి పై కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి, భువనగిరి ఆర్డీవో పి.అమరేందర్ తెలిపారు. మోత్కూరు మునిసిపల్ కార్యాలయంలో అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చైర్‌పర్సన్ సావిత్రిపై అవిశ్వాసం ప్రకటిస్తూ గత జనవరి 20న తొమ్మిది మంది కౌన్సిలర్లు కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం ఇచ్చారన్నారు. శుక్రవారం ఓటింగ్ నిర్వహించేందుకు కలెక్టర్ తనను ప్రిసైడింగ్ అధికారిగా నియమించారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటింగ్ నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేయగా పది మంది కౌన్సిలర్లు హాజరయ్యారన్నారు. మోత్కూరు మునిసిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉండగా ఓటింగ్ నిర్వహించేందుకు 2/3 మంది అంటే 8 మంది కౌన్సిలర్లు అవసరం కాగా పది హాజరు కావడంతో చేతులు ఎత్తే పద్ధతిన ఓటింగ్ నిర్వహించామన్నారు. పది మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారన్నారు. అవిశ్వాసం ఎదుర్కొంటున్న చైర్ పర్సన్ (ఏడో వార్డు కౌన్సిలర్) సావిత్రి, పదో వార్డు కౌన్సిలర్ బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి ఓటింగ్‌కు గైర్హాజర్ అయ్యారన్నారు. అవిశ్వాసం నెగ్గినట్టుగా తాను కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని, కలెక్టర్ సీఎండీఏకు, ఎన్నికల కమిషన్‌కు తెలియపర్చుతారన్నారు. నూతన చైర్మన్ ఎన్నిక మరోసారి ఉంటుందన్నారు. మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ ఆయన వెంట ఉన్నారు.

అగౌరవ పర్చడం, పనులు చేయకపోవడంతోనే అవిశ్వాసం: వైస్‌చైర్మన్

చైర్ పర్సన్ సావిత్రి భర్త మేఘారెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తూ తమను అగౌరవ పర్చేవారని, తమ వార్డుల్లో చెప్పిన అభివృద్ధి పనులు చేయక పోవడంతోనే తాము ఆమెపై అవిశ్వాసం పెట్టామని వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, వార్డు కౌన్సిలర్లు తెలిపారు. అవిశ్వాసంపై జరిగిన ఓటింగ్ అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తమ వార్డుల్లోని అభివృద్ధి పనులు కూడా ఆయన ఆధ్వర్యంలోనే చేసేవారని, తమ వార్డులో మంచి నీటి బోరు చెడిపోయినా ఆయన్నే అడగాల్సి వచ్చేదన్నారు. చైర్ పర్సన్ సావిత్రి, ఆమె భర్త మేఘారెడ్డి వ్యవహార శైలికి విసిగిపోయి అవిశ్వాసం పెట్టామన్నారు. కాగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి విప్ జారీ చేశారు కదా అని బీఆర్ఎస్ కౌన్సిలర్లను ప్రశ్నించగా తమకు విప్ ఆదేశాలు అందలేదన్నారు.

బీఆర్ఎస్ మద్దతుతో కాంగ్రెస్ విజయం

మోత్కూరు మునిసిపల్ చైర్ పర్సన్ సావిత్రిపై గత జనవరి 20న నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తూ కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం ఇచ్చారు. అవిశ్వాస తీర్మానం కలెక్టర్‌కు ఇచ్చిన వెంటనే తొమ్మిది మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లారు. ఈ నెల 9న అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ ప్రకటించడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఆదేశిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి విప్ జారీ చేశారు. కౌన్సిలర్లు క్యాంపులో ఉండటంతో ఆయన రిజిస్టర్డు పోస్టులో విప్ పత్రాలు పంపారు. కౌన్సిలర్ల ఇంటి గోడలకు అంటించారు. కాగా కౌన్సిలర్లు ఇళ్లకు వెళ్లకుండా శుక్రవారం క్యాంపు నుంచి నేరుగా ఓటింగ్ సమయానికి ఐదు నిముషాలు ముందుగానే మునిసిపల్ కార్యాలయానికి చేరుకుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. అవిశ్వాస తీర్మానంపై సంతకం చేయకుండా మునిసిపల్ చైర్ పర్సన్ సావిత్రికి మద్దతుగా నిలిచిన 12వ వార్డు కౌన్సిలర్ కూరెల్ల కుమారస్వామి ఓటింగ్‌కు హాజరై అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారు. బీఆర్ఎస్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, వనం స్వామి, దబ్బెటి విజయ, కూరెల్ల కుమారస్వామి, కాంగ్రెస్ కౌన్సిలర్లు కారుపోతుల శిరీష, లెం కల సుజాత, ఎర్రవెల్లి మల్లమ్మ, మలిపెద్ది రజిత, గుర్రం కవిత అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయడంతో అవిశ్వాసం నెగ్గింది.



ఓటింగ్ అనంతరం బయటకు వచ్చిన కౌన్సిలర్లు



విలేకరులతో మాట్లాడుతున్న ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో అమరేందర్

భారీ పోలీస్ బందోబస్తు

మునిసిపల్ చైర్ పర్సన్‌పై ప్రకటించిన అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించనుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య నేతృత్వంలో రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, మోత్కూరు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు ఎస్ఐలు, 40 మంది సివిల్, స్పెషల్, మహిళా పోలీసులతో బందో బస్తు ఏర్పాటు చేశారు.

'ప్రజాపాలన' దరఖాస్తుల్లో తప్పుల దిద్దుబాటు

● రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకంపై కసరత్తు



వివరాలను సేకరిస్తున్న మునిసిపల్ కౌన్సిలర్, సిబ్బంది

చౌటుప్పల్ మునిసిపాలిటీ, ఫిబ్రవరి 9: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అందించిన దరఖాస్తుల్లో భారీగా తప్పిదాలు దొర్లినట్లు మునిసిపల్ అధికారులు గుర్తించారు. వాటిని సరిచేసేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. ముఖ్యంగా ప్రస్తుతం సబ్సిడీ గ్యాస్ సిలిండర్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో తప్పిదాలు సరిచేసే కార్యక్రమానికి మునిసిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే ఇప్పటికే దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయగా ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ పథకానికి ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిక్షిప్తం చేసిన గ్యాస్ సిలిండర్‌కు చెందిన సమాచారాన్ని ఆయా గ్యాస్ ఏజెన్సీలకు అందజేయగా గ్యాస్‌బుక్ నెంబర్లను తప్పులుగా వేసినట్లు గుర్తించారు. ఇదే విషయంపై సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ప్రభుత్వం ప్రజల నుంచి తిరిగి సరైన సమాచారాన్ని సేకరించాలని కోరడంతో మునిసిపల్‌లోని వార్డు అధికారులు ఇంటింటికీ తిరిగి సమాచారాన్ని సేకరించి, తప్పులను సరిచేస్తున్నారు. విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్, రేషన్‌కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించిన్నట్లు విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

తప్పులు దొర్లిన దరఖాస్తులు 3208

చౌటుప్పల్ మునిసిపల్ పరిధిలో ప్రజాపాలన దరఖాస్తుల్లో గ్యాస్ సబ్సీడి కోసం ఇచ్చిన సమాచారంలో తప్పులు దొర్లిన దరఖాస్తులు 3208 ఉన్నట్లు తెలిసింది. అయితే వార్డుల వారిగా వార్డు అధికారులు శుక్రవారం ఇంటింటికి తిరిగి తప్పులు దొర్లిన సమాచారాన్ని సరిచేసే పనిలో పడ్డారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా గ్యాస్ కనెక్షన్ కాగితాలు చూసి ధ్రువీకరించుకుని గ్యాస్ సిలిండర్ వినియోగదారుడి నంబర్, ఏజెన్సీ పేరు నమోదు చేస్తున్నారు.

తప్పులను నేటి సాయంత్రానికి పూర్తి చేస్తాం



చౌటుప్పల్ మునిసిపల్ పరిధిలో ప్రజాపాలనలో గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన 3208 దరఖాస్తుల్లో తప్పులు దొర్లాయి. వాటిని గుర్తించి సరిచేయడానికి ఆదేశాలు ఇచ్చాం. మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో శుక్రవారం 50శాతం వరకు సరిచేశాం. మిగిలిన వాటిని నేటి సాయంత్రానికి సరిచేస్తాం. వార్డు అధికారులు ఇంటింటికీ వెళ్లి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

-ఎస్.భాస్కర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్, చౌటుప్పల్

ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడం మోసం చేయడమే



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 9: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పడం తెలంగాణ రైతాంగాన్ని మోసం చేయడమేనని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాడు స్వరాష్ట్రం కోసం ఉద్యమం చేశామని, నేడు హక్కుల సాధన కోసం ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈనెల 13న నల్లగొండలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీధర్, పాల్వాయి స్రవంతి, జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, కత్తుల లక్ష్మయ్య, జక్కిడి జంగారెడ్డి గడ్డం మురళీధర్‌రెడ్డి, దేప విప్లవ్‌రెడ్డి, దోనూరు జైపాల్‌రెడ్డి, మన్నె ఇంద్రసేనారెడ్డి, ఆడెపు పరదేశి ఉన్నారు.

ఉపాధి కూలీలకు రోజుకు రూ.800 ఇవ్వాలి



కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 9: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు రోజువారీ కనీస వేతనం రూ.800 చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు కల్యూరి భిక్షపతి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని భీమనపల్లి గ్రామంలో ఉపాధి హామీ కార్మికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కారు ఎత్తివేయాలని కుట్ర చేస్తోందన్నారు. ప్రభుత్వం సంవత్సరానికి 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజు కూలి రూ.800 చెల్లించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, సమ్మెను కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంచాల మధు, బూరుగు భిక్షపతి, గూని మల్లేష్, సునీత, పుల్లమ్మ, కమలమ్మ, మంజుల, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఇంటినుంచి పారిపోయిన యువకుడు

పోలీసులకు అప్పగించిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 9: తండ్రి తిట్టాడని క్షణికావేశంతో ఇంటిని వీడిన ఓ యువకుడి ఆర్ఎస్ఎస్ కార్యర్తలు సెల్ ఫోన్ మ్యాప్ లోకేషన్‌తో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరుకు చెందిన ఉదయ్ తల్లిదండ్రులతో గొడవ పడి శనివారం మధ్యాహ్నం ఇంటిని వీడి బస్సు ద్వారా భువనగిరికి చేరాడు. అనంతరం తాను రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులకు సెల్ ఫోన్‌తో సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు మోత్కూరులోని జిల్లా ఆర్ఎస్ఎస్ గ్రామీణ వికాస్ ప్రముఖ్ కాంబోజు మహేందర్ భువనగిరిలోని ఆర్ఎస్ఎస్ విభాగ్ శారీరక్ ప్రముఖ్ బేతి కన్నయ్యకు సమాచారం ఇచ్చి ఉదయ్ సెల్ ఫోన్ నెంబర్‌ను షేర్ చేశాడు. అదే సమయంలో ఉదయ్ కుటుంబ సభ్యులు పోలీసులకు కూడా సమాచారం ఇచ్చారు. అయితే ఉదయ్ వివరాలను బేతికన్నయ్య, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో పాటు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను అప్రమత్తం చేశారు. దీంతో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఉదయ్ లోకేషన్ ట్రేస్ చేస్తూ భువనగిరి రైల్వే స్టేషన్ వద్ద పట్టుకుని భువనగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు. యువకుడి తల్లిదండ్రులకు ఉదయ్‌ను అప్పగించారు.

వరి సాగులో మొగి పురుగు నివారణ చర్యలు చేపట్టాలి

● జిల్లా వ్యవసాయాధికారి కె.అనూరాధ



భూదాన్‌పోచంపల్లి : రైతుల సమస్యలు తెలుసుకుంటున్న శాస్త్రవేత్తలు, అధికారులు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 9 : వరి సాగులో మొక్కలు ఎదగకపోవడం, ఆకులు పసుపు రంగులోకి మారడం, మొగి పురుగు ఆశించడం వల్ల దుబ్బలు చనిపోతుంటాయని, ఇందుకోసం తగు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి కె.అనూరాధ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని దోతిగూడెం, అంతమ్మగూడెం, జిబ్లక్‌పల్లి, కనుముకుల, భూదాన్‌పోచంపల్లిలోని పంట పొలాలను పరిశీలించారు. వరి సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి సాగులో మొగి పురుగు నివారణకు 1 ఎకరానికి 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 60 మిల్లీలీటర్ల క్లోరాన్ ట్రానిలీప్రోల్ లేదా 120 మిల్లీ లీటర్ల ఐసోసైక్లోసీరమ్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రాజేంద్రనగర్‌లోని వరి పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.కిరణ్‌బాబు, భువనగిరి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఎజాజ్ అలీఖాన్, జె.నరేష్, సోని పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: భూసార పరీక్షలకనుగుణంగా రైతన్నలు పంటలను సాగు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ముచ్చిక ప్రధాన శాస్త్ర శాస్త్రవేత్త శంకర్ అన్నారు. మండలంలోని శారాజీపేటలో సూక్ష్మపోషక విభాగం ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల రైతులకు వందశాతం సబ్సిడీపై బ్యాటరీ స్ప్రేలను పంపిణీ చేశారు. ఏడీఏ వెంకటేశ్వర్‌రావు, ఏవో దీప్తి, ఏఈవో నాగార్జున శాలిని, నాగార్జున శాలిని, పవన్‌కల్యాణ్, శివకుమార్, రైతులు కిష్టయ్య, బండ నాగిరెడ్డి, రాంనర్సయ్య, రాములు ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : ఆలేరు ప్రాంతానికి చెందిన భూములల్లో భాస్వరం నిల్వలు అధికంగా ఉన్నాయని, పీఎస్‌బీ వాడకం ద్వారా నిల్వలను కరిగించి, భాస్వరానికి పెట్టే ఖర్చులు తగ్గించుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ మమత సూచించారు. మండలంలోని పల్లెర్లలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో సరిత పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: పండ్ల సాగుతో రైతులకు రెట్టింపు ఆదాయం సమకూరుతుందని హార్టికల్చర్ అధికారి సైదులు అన్నారు. మండలంలోని తుక్కాపురం ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో పుచ్చపండ్ల పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏజీఐ సీనియర్ మేనేజర్ శివరాం, జోగిరెడ్డి, మాజీ సర్పంచ్ పదమహేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్ ఉన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్



చౌటుప్పల్ టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 9: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16 న నిర్వహించే దేశ వ్యాప్త గ్రామీణ బంద్‌లో సకల జనులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో జహంగీర్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలు, కార్మికులను మోసం చేసిందని ఆయన అన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి, హక్కులను కాలరాసేందుకు కుట్ర చేస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని, గ్రామీణ బంద్‌లో సకల జనులు పాల్గొని బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు మాటూరి బాలరాజు, బూరుగు కృష్ణారెడ్డి, గంగదేవి సైదులు, గడ్డం వెంకటేశ్, చీరిక సంజీవ రెడ్డి, పల్లె మధు, బొజ్జ బాలయ్య, కొండే శ్రీశైలం, బోయ యాదయ్య, ఆదిమూలం నందీశ్వర్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్ కోరారు. ఆలేరులో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చ, భారత కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ మతోన్మాదాన్ని పెంచిపోషిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు బోరెడ్డి, రాములు, గడ్డం నాగరాజు, మొరిగాడి రమేష్, వెంకటేష్, రమేష్, కుమార్, మురళి, రాజయ్య, నర్సింహారెడ్డి, అంజయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మోటకొండూర్ : ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్న సీపీఎంను ఆదరించాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరు మల్లేశం కోరారు. మండల కేంద్రంలో ఇంటింటికీ సీపీఎం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

చౌటుప్పల్ టౌన్ : ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలో శుక్రవారం యాక్సిస్ బ్యాంక్ శాఖ ను చైర్మన్ రాజు ప్రారంభించారు.

● చౌటుప్పల్ పట్టణంలోని నూతన శివాలయానికి స్థానిక వ్యాపారవేత్త గుజ్జుల రవీందర్ రెడ్డి మైక్ సెట్ ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కుక్కల నర్సింహ, వీరమళ్ల యాదయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ మునిసిపాలిటీ : చౌటుప్పల్ నుంచి భువనగిరి వెళ్లే చిన్నకొండూర్ రోడ్డు విస్తరణను తక్షణమే చేపట్టాలని మునిసిపల్ కౌన్సిలర్లు చైర్మన్ వెన్‌రెడ్డి రాజుకు వినతి పత్రం అందజేశారు. ఆయా పార్టీల ఫ్లోర్‌లీడర్లు ఉన్నారు.

చౌటుప్పల్ మునిసిపాలిటీ/చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 9: చౌటుప్పల్ మునిసిపాలిటీ లక్కారం గ్రామం పరిధిలోని ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 614 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు రూ.4.34 లక్షల విలువైన బ్యాగులు, పాదరక్షలు, మందులలను అందజేశారు.

భువనగిరి టౌన్: జిల్లాకు మంజూరైన వైద్య కళాశాలను సీఎం నియోజకవర్గం కొడంగల్‌కు తరలించే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని బీజేవైఎం జోనల్ ఇన్‌చార్జ్ పట్నం కపిల్ అన్నారు. కళశాల తరలింపు ప్రయత్నాలను నిరసిస్తూ శుక్రవారం భువనగిరిలో బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు.

● భువనగిరి పట్టణంలోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో సంధ్య డెంటల్ క్లినిక్ ఆధ్వర్యం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుదీర్‌రెడ్డి, డాక్టర్ సంధ్యారాణి, ప్రిన్సిపాల్ మల్లేశం ఉన్నారు.

గుండాల: ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని భువనగిరి ఆర్డీవో అమరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఫామ్-18 ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తు శుక్రవారం పరిశీలించారు.

ఆలేరు రూరల్: కురుమ సంఘం ఆలేరు పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎగ్గిడి శ్రీశైలంను మాజీ సర్పంచ్ ఆకవరం మోహన్‌రావు సన్మానించారు. సంఘం అధ్యక్షుడిగా అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నారని కొనియాడారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 30 మది కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు ఎంపీపీ గుత్తా ఉమాదేవి చెక్కులను పంపిణీ చేశారు.

● పేద ప్రజల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనూరి వీరారెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు.

అడ్డగూడూర్ : పోటీలతో క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యం పెరుగుతుందని అడ్డగూడూర్ తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మండల పరిధిలోని రాపాక(డి)గ్రామంలో రాష్ట్రస్థాయి ద్వితీయ కబడ్డీ క్రీడోత్సవాలు ప్రారంభించి మాట్లాడారు.

బొమ్మలరామారం: మండల కేంద్రంలో గట్టు మైసమ్మ ఆటో యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అందె మహేష్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, ట్రెజరర్ మేకల రమేష్, జనరల్ సెక్రటరీగా బూడిద రాజు, ప్రధాన కార్యదర్శి తూడి మల్లేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రామన్నపేట: మండలంలోని వెల్లంకి గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి గ్రామ యువకులు 30 మంది క్రీడాల్లో రాణించడానికి ప్రోత్సాహకంగా క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్స్, టీషర్ట్స్, ట్రాక్ ప్యాంట్స్, షూస్ అందజేశారు.

● భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వం అందించే సేవలను ఉపయోగించుకోవాలని సహాయ కార్మిక అధికారి ప్రవీణ్‌చంద్ అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని రామన్నపేట కార్మిక శాఖ కార్యాలయంలో ఆవిష్కరించి, మాట్లాడారు. గొరిగె సోములు, రాధారపు మల్లేషం, బొడ్డుపల్లి వెంకటేశం పాల్గొన్నారు.

తుర్కపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతీ రోజైన ఫిబ్రవరి 15ను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆరోజు ఐచ్చిక సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని డీసీసీ ఉపాధ్యాక్షుడు ధనావతు భాస్కర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వలిగొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో దివ్యాంగులకు 5శాతం నిధులు కేటాయించాలని దివ్యాంగుల హక్కుల సంఘం జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాశ్ డిమాండ్ చేశారు. మండలంలోని లోతుకుంట గ్రామంలో దివ్యాంగుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను ఖండించాలి



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 9: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని బీసీ కాదంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం బూర నర్సయ్య గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలోనూ మోదీని కుల పరంగా రాహుల్ గాంధీ అవహేళన చేశారని ఆయన గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత కాంగ్రెస్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారబోతుందని, ఇక అందులో అంతర్గత కుమ్ములాటలు తప్పవని ఆయన అన్నారు. మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావుకు భారత రత్న ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బూర నర్సయ్య గౌడ్ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మండల ఇంచార్జ్ జి. సురేందర్ రెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ పి. శ్రీధర్ బాబు, నాయకులు పి. జంగయ్య గౌడ్, ఊడుగు యాదయ్య గౌడ్, డి. బిక్షమాచారి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఆలె చిరంజీవి, యు. నాగరాజు, బండారు మహేందర్ రెడ్డి, పర్నే శ్రీనివాస్ రెడ్డి, ఊదరి రంగయ్య, పిల్ల బుచ్చయ్య పాల్గొన్నారు.

చురుకుగా యాదాద్రి మేడారం జాతర పనులు

రాజాపేట, ఫిబ్రవరి 9: రాజాపేట మండలం చల్లూరు గ్రామంలోని యాదాద్రి మేడారం సమ్మక్క సారలమ్మ జాతర పనులు చురుకుగా సాగుతున్నాయి. ఆలయం వద్ద గద్దెల నిర్మాణంతో పాటు భూమిని చదును చేస్తున్నారు. గ్రామం నుంచి ఆలయం వద్దకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. మంచినీటి, విద్యుత్ సౌకర్యాలతో పాటు పొట్టిమర్రి, ఇబ్రహీంపూర్ క్రాస్‌రోడ్ల నుంచి ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు వంచ వీరారెడ్డి తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు జాతర జరుగుతోందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఉపకార వేతనాల దరఖాస్తులకు గడువు పొడిగింపు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 9: జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో చదువుతున్న అర్హులైన ఎస్సీ కులాల విద్యార్థులకు ఉపకార వేతనాలకు సంబంధించి దరఖాస్తులు చేసుకునేందుకు గడువును పొడగించినట్లు ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను అర్హత గల ఎస్సీ కులాల విద్యార్థులు పోస్టు ప్రక్రియ కోసం ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఉపాధిహామీ పనులను పారదర్శకంగా తనిఖీ చేయాలి

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 9: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను పారదర్శకంగా తనిఖీ చేయాలని ఎంపీడీవో గుత్తా నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరి ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్‌లో 14వ విడత సామాజిక తనిఖీ కో ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామస్తులకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో అడిగి తెలుసుకుని నివేదికలను పారదర్శకంగా, సమగ్రంగా రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో బాలస్వామి, ఈసీ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేత కూనూరు జట్టు



జిల్లాస్థాయిలో విజేతగా నిలిచిన కూనూరు జట్టు సభ్యులు

ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 9: మండల కేంద్రంలో నేతాజీ యువజన మండలి ఆధ్వర్యంలో ప్రతికంఠం వెంకటరామనర్సరాజు, మాణిక్యమ్మల స్మారకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీలల్లో 36 జట్లు పాల్గొనగా కూనూరు గ్రామానికి చెందిన జట్టు విజయం సాధించిన రూ.20,016తో పాటు షీల్డును కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానం పొందిన ఆత్మకూరు(ఎం) జట్టుకు రూ .10016 ల నగదు బహుమతులతో పాటు షీల్డు లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాస కవితాఇంద్రారెడ్డి, మాజీ సర్పంచులు జె.నాగేష్, పి.పూర్ణచందర్‌రాజు. పి.హేమలత, బి.చందర్, నేతాజీ యువజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు పి.శంతన్‌రాజు, ఏ.మురళీ, పి.మల్లేశం పాల్గొన్నారు.

కేజీబీవీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి: సీపీఎం

మోత్కూరు, ఫిబ్రవరి 9: మోత్కూరు కస్తూర్బా పాఠశాలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం మండల కమిటి ఆధ్వర్యంలో కస్తూర్బా పాఠశాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను, విద్యార్థినుల భోజనాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెస్ చార్జీలు తక్కువగా ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. పాఠశాలలో డ్రైనేజీ సక్రమంగా లేదన్నారు. కార్యక్రమంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల కార్యదర్శులు గుండు వెంకటనర్సు, బుర్రు అనిల్‌కుమార్, చింతల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

వలిగొండ, ఫిబ్రవరి 9: మద్యానికి బానిస అయిన యువకుడు శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అరూరు గ్రామానికి చెందిన గౌతమ్(22) కూలీ పనులు చేసేవాడు. చిన్ననాటి నుంచి తన అమ్మమ్మ యాదమ్మ ఇంట్లో ఉంటూ ఆమె ఆలనా పాలనలో పెరిగాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అమ్మమ్మ ఇంటికి వచ్చి చూసే సరికి ఉరితాడుకు వేలాడుతున్నాడు. గ్రామస్థుల సహాయంలో పోలీసులకు సమాచారం చేరవేశారు. గౌతమ్ తల్లి సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.